సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 12 । ఏప్రిల్ । 2024



అకాల వర్షం.. పంటలకు నష్టం

తాంసి, భీంపూర్ మండలాల్లో రెండ్రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. 8లో▸



ఘనంగా జ్యోతిబాపూలే జయంతి

మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. పూలే చిత్రపటాలకు నేతలు, అధికారులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0/24.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా, పలుచోట్ల పూర్తిగా మేఘావృతమవుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

15న పార్టీలతో సమావేశం

కైలాస్‌నగర్: ఈ నెల 18నుంచి పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుండగా ఈ నెల 15వ తేదీన మధ్యాహ్నం 3గంటలకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ సమావేశం మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికలాధికారి, కలెక్టర్ రాజర్షిషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని పార్టీల నాయకులు హాజరుకావాలని కోరారు.

కథల పోటీల్లో కీర్తి ప్రతిభ



తల్లెల కీర్తి

జైనథ్: మండలంలోని లక్ష్మీపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తల్లెల కీర్తి రాసిన 'రాము–సోము' కథ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఉత్తమంగా నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు పోరెడ్డి అశోక్ తెలిపారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు నిర్వహించిన కథల పోటీల్లో 61 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఇందులో 31 కథలను ఉత్తమమైనవిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. వీటిని సారస్వత పరిషత్ పుస్తక రూపంలో ముంద్రించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్తమ కథలు రాసిన విద్యార్థులకు మే నెలలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న పుస్తకావిష్కరణ కార్యక్రమంలో బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. కాగా, తల్లెల కీర్తి గతంలో రాసిన 'ఫోను–చదువు' కథ ఫిబ్రవరిలో చెకుముకి మాసపత్రికలో ప్రచురితమైనట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభకబర్చిన కీర్తిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. భవిష్యత్‌లో గొప్ప రచయిత్రి కావాలని వారంతా ఆకాంక్షించారు.

ఆదిలాబాద్‌కు పాదయాత్ర



జిల్లా కేంద్రంలో పాదయాత్ర చేస్తున్న భక్తులు

ఆదిలాబాద్‌రూరల్: నార్నూర్ మండలం కొత్తపల్లి–హెచ్ దీక్ష భూమి నుంచి సేవా లాల్ దీక్ష గురువు ప్రేమ్‌సింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో ఉగాది రోజు ప్రారంభమైన బంజారా కాశీపౌరదేవి యాత్ర గురువారం జిల్లా కేంద్రానికి చేరింది. వందలాది మంది సేవాలాల్ భక్తులు పాదయాత్రలో పాల్గొన్నారు. వారం తర్వాత ఈ యాత్ర మహారాష్ట్రలోని వసీం జిల్లా పౌరదేవి ఆలయానికి చేరుకుంటుందని భక్తులు తెలిపారు.

ఇంద్రాదేవికి పూజలు



ఇంద్రాదేవికి మొక్కుతున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవమైన మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో చైత్రమాస పూజలు కొనసాగుతున్నాయి. గురువారం మండలంలోని వడగామ్, సిరికొండ మండలం మల్లాపూర్ గ్రామాలతోపాటు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి అధికసంఖ్యలో వచ్చిన ఆదివాసీలు ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ పరిసర ప్రాంతం భక్తజనంతో కిటకిటలాడింది. ఇంద్రాదేవి ఆలయ ప్రాంగణంలో స్థలం సరిపోకపోవడంతో మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో నైవేద్యం తయారు చేసి ఇంద్రాదేవికి సమర్పించారు. చైత్రమాస పూజలు నెలపాటు కొనసాగుతాయని ఆలయ మహరాజ్ చహకటి సూర్యరావ్ తెలిపారు.

కాంగ్రెస్‌లోకి ముగ్గురు మాజీ సర్పంచులు



మాజీ సర్పంచ్‌కు కండువా వేస్తున్న బొజ్జు

ఇంద్రవెల్లి: మండలంలోని ఈశ్వర్‌నగర్, గిన్నెర, డోంగర్‌గావ్ మాజీ సర్పంచులు రాథోడ్ శారద, ఆడే విజయ, రాథోడ్ రాంచందర్ గురువారం ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



సందేశమిస్తున్న మత గురువు



ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు



ఆలింగనం చేసుకుంటున్న చిన్నారులు

ఈద్ ముబారక్

- ఈద్గా వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



ప్రార్థన చేస్తున్న బాలుడు



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న జోగు రామన్న, ఆత్రం సక్కు



తన సోదరులతో ఎస్పీ గౌస్ ఆలం

రంజాన్ మాసంలో వచ్చే ఈద్ ఉల్ ఫితర్ వేడుకలను గురువారం జిల్లా కేంద్రంలో ముస్లింలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకొన్నారు. ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. ఖురాన్ బోధనలు అనుసరించాలని, శాంతి సౌభ్రాతృత్వంతో మెలగాలని మతపెద్దలు ఈ సందర్భంగా సందేశం వినిపించారు. జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్‌లో గల ఈద్గా మైదానానికి పట్టణంలోని ముస్లింలు అధికసంఖ్యలో వచ్చారు. స్థలం సరిపోక పాత జాతీయ రహదారిపై కూడా ప్రార్థనలు చేశారు. మసీదుల్లో నమాజ్ చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, అనిల్‌కుమార్ తదితరులు ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ గౌస్ ఆలం తన సోదరులతో ఈద్గా వద్ద ప్రార్థన చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈద్గా మైదానం మార్గంలో ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు తమ బంధువులు, స్నేహితులను ఇంటికి ఆహ్వానించి ఖీర్ పాయసాన్ని అందించారు. – కైలాస్‌నగర్



ముస్లింలను ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుతున్న అనిల్‌కుమార్

తెగల్లో చీలిక!

- గొంతెత్తిన ఆదివాసీల్లోని గోండేతరులు
- పదవుల్లో ప్రాతినిధ్యం లేదని ఆరోపణ
- రాజకీయ పార్టీల ధోరణిపై వ్యతిరేకత
- 15వ తేదీలోపు స్పష్టతకు అల్టిమేటం
- లేకుంటే బరిలో ఉంటామని హెచ్చరిక
- ఆదివాసీల్లో పెరిగిన అంతర్గతపోరు



గోండేతరులు ముద్రించిన ఫ్లెక్సీ



ఇటీవల జిల్లా కేంద్రంలో సమావేశమైన గోండేతర తెగలవారు

సాక్షి, ఆదిలాబాద్: ఆదివాసీ తెగల్లో చీలిక కనిపిస్తోంది. రాజకీయంగా ఎస్టీ రిజర్వ్‌డ్ పదవుల్లో పోటీ చేసే విషయంలో రాజకీయ పార్టీలు తమను పరిగణనలోకి తీసుకోవడం లేదని గోండేతరులు ఆరోపిస్తున్నారు. ఈ ధోరణి మారాలంటున్నారు. గోండు తెగకు చెందిన ముగ్గురు నేతలను మూడు పార్టీలు ఎంపీ అభ్యర్థులుగా ప్రకటించాయని మండిపడుతున్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనైనా ఇలాంటి రిజర్వ్‌డ్ పదవుల కేటాయింపుపై ఇప్పుడే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్‌లో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, ఇతర ముఖ్యమైన పదవుల్లో ఒకటి గోండులకు ఇస్తే, మరొకటి గోండేతర తెగలవారికి ఇచ్చేలా పార్టీలు చొరవ చూపాలని కోరుతున్నారు. ఈ విషయంలో ఈ నెల 15వ తేదీలోపు స్పష్టత ఇవ్వాలని, లేని పక్షంలో తమలోంచి ఒకరిని స్వతంత్ర అభ్యర్థిగా పార్లమెంట్ ఎన్నికల బరిలోకి దించుతామని హెచ్చరిస్తున్నారు.

ఎటు దారితీస్తుందో..

లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీలు ఎన్నో ఏళ్లుగా ఉద్యమిస్తున్నారు. డిమాండ్ సాధనకు ఆదివాసీల్లోని అన్ని తెగలవారు పోరాడుతున్నారు. ప్రస్తుతం రాజకీయ పదవుల్లో తమను అసలు పరిగణనలోకి తీసుకోవడం లేదని గోండేతర తెగలవారు గొంతు కలిపారు. ఈ చీలిక వారి ప్రధాన ఉద్దేశాన్ని దెబ్బ తీస్తుందా.. అనే చర్చ కూడా సాగుతోంది. ఏదేమైనా ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంలో ప్రస్తుతం ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. ఒక పక్క ఈ స్థానంలో ప్రధాన పార్టీల నుంచి తమకు అవకాశం ఇవ్వలేదని లంబాడాలు ఇప్పటికే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని పార్టీల్లోని లంబాడా నేతలు ఏకతాటిపైకి వచ్చి ఈ విషయంపై చర్చించాలని బంజారా సమాజం పిలుపునిచ్చింది. ఇప్పటికే ఈ విషయంలో పలుసార్లు ఉమ్మడి జిల్లాలో వారు సమావేశాలు కూడా నిర్వహించారు. తమ నుంచి ఒక నేతను స్వతంత్ర అభ్యర్థిగా పార్లమెంట్ ఎన్నికల బరిలోకి దించాలని యోచిస్తున్నారు. మరో పక్క ఆదివాసీ తెగల్లో చీలిక రావడం, తమ డిమాండ్లను పరిగణనలోకి తీసుకోకపోతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతామని చెప్తుండటం ప్రాధాన్యత కలిగిస్తోంది. దీంట్లో పర్ధాన్ సమాజం నుంచి దుర్వ నగేశ్, పెందూర్ సుధాకర్, నాయక్‌పోడ్ తెగ నుంచి సట్ల అశోక్‌లో ఎవరినైనా పోటీ చేయించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలన్నీ రాజకీయంగా ఆసక్తి కలిగిస్తున్నాయి.

గొంతెత్తిన తెగలు..

ఆదివాసీల్లో గోండు, కొలాం, నాయక్‌పోడ్, ఆంద్, పర్ధాన్, మన్నేవార్, తోటి, గుత్తికోయ, చెంచు మొదలైన తొమ్మిది తెగలుండగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొదటి ఏడు తెగల ఆదివాసీలు జీవిస్తున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం ఎస్టీ రిజర్వ్‌డ్ కాగా, ఇటీవల ప్రధాన పార్టీలు గోండు సామాజిక వర్గాలవారినే అభ్యర్థులుగా ప్రకటించాయని గోండేతరులు ఆరోపిస్తున్నారు. ఆదివాసీల్లో అధిక జనాభా గోండు వారిదే కాగా, మిగతా తెగలందరి జనాభా కలిపితే గోండుల కంటే అధికంగా ఉందని వారు పేర్కొంటున్నారు. అయితే రాజకీయ పదవుల కేటాయింపులో తమ తెగలను కూడా గుర్తించాలని కోరుతున్నారు. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లాలోని పర్ధాన్, తోటి, కొలాం, నాయక్‌పోడ్, ఆంద్, మన్నేవార్ తెగలవారు సమావేశమయ్యారు. ఈ విషయంలో ఇదివరకు నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో సమావేశాలు పూర్తి చేశారు.

తైక్వాండో అసోసియేషన్ కార్యవర్గం



అసోసియేషన్ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు


ఎదులాపురం: సాహ తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా అన్నారపు వీరేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గురువారం తైక్వాండో అసోసియేషన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం, ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అబ్జర్వర్‌గా తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ నుంచి సంతోష్, ఎన్నికలాధికారిగా ఏ కృష్ణప్రసాద్, ఎలక్షన్ కమిటీ చైర్మన్‌గా జీ వెంకటస్వామి వ్యవహరించారు. జిల్లా ఒలింపిక్ సంఘం కన్వీనర్ పార్థసారథి, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అబ్జర్వర్ రాజు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా శృతి, కోశాధికారిగా మాధవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన వీరేశ్ మాట్లాడారు. జిల్లాలో తైక్వాండో క్రీడాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. సభ్యులందరి సహకారంతో త్వరలో ప్రత్యేక వేసవిశిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కబడ్డీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్, హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి హరిచరణ్, వ్యాయామ విద్యాసంఘం నాయకులు స్వామి, దయానందరెడ్డి, గుండి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కపోత నుంచి ఉపశమనం

- అకాలవర్షంతో తగ్గిన ఉష్ణోగ్రతలు
- జిల్లాలో 9.5 మిల్లీమీటర్ల వర్షం
- పలుచోట్ల నేలకొరిగిన జొన్న

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉక్కపోతతో సతమతమవుతున్న జనాలకు ఉపశమనం లభించింది. కొద్దిరోజులుగా భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండగా, జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43డిగ్రీలకు చేరాయి. ఇలాంటి తరుణంలో కురిసిన అకాలవర్షం జిల్లావాసులకు ఊరటనిచ్చింది. కొన్నిచోట్ల ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి జొన్న పంట నేలకొరిగింది. చేతికందివచ్చిన మామిడికాయలు నేలరాలాయి. బాధితరైతులు బావురుమంటుండగా, పంటలకు ఎలాంటి నష్టం జరగలేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఆదివారం రాత్రి నుంచి ప్రతీరోజు కొంత వర్షం కురుస్తూనే ఉంది. బుధవారం అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు సాధారణం నుంచి మోస్తరు స్థాయిలో కురిసింది. జిల్లాలో సరాసరి 9.5 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లుగా వ్యవసాయశాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆదిలాబాద్ పట్టణంలో అత్యధికంగా 9.5, జైనథ్ మండలం భోరజ్‌లో 7.8, భీంపూర్ మండలం అర్లి–టీలో 7.0, బజార్‌హత్నూర్‌లో 6.8, ఆదిలాబాద్ రూరల్ మండలం పిప్పల్‌ధరిలో 6.3, బేలలో 5.8, తాంసిలో 4.5, బోథ్ మండలం సోనాలలో 3.8, తలమడుగు మండలం భరంపూర్‌లో 2.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. గురువారం రంజాన్ కావడంతో ఉదయం కురిసిన వర్షంతో ఈద్గాల వద్ద ప్రార్థన చేసుకునేందుకు ముస్లింలు కొంత ఇబ్బందులకు గురయ్యారు. సాయంత్రం అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు కురిశాయి. జిల్లాలో గురువారం కనిష్ఠ ఉష్ణోగ్రత 20.2, గరిష్ఠ ఉష్ణోగ్రత 38.3 డిగ్రీలుగా నమోదయ్యాయి. మూడు, నాలుగు రోజుల క్రితం అత్యధికంగా గరిష్ఠ ఉష్ణోగ్రత 43 డిగ్రీలుగా నమోదైన సంగతి తెలిసిందే.

14వరకే ఓటు నమోదు గడువు



కైలాస్‌నగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ ఓటు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం చర్యలు చేపడుతోంది. ఇప్పటివరకు ఓటు లేని అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఓటరు నమోదుకు ఈ నెల 14వ తేదీ వరకే గడువు ఉండగా అప్రమత్తం చేస్తోంది. ఈ నెల 1వ తేదీ నాటికి 18 ఏళ్ల నిండిన యువతీయువకులు ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తోంది. ఇందుకు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరించేలా ఎస్సెస్సీ మార్కుల మెమో జత చేయాలని అధికారులు చెబుతున్నారు. దరఖాస్తులను నేరుగా ఆయా బీఎల్వో (బూత్ లెవల్ అధికారులు) లు లేదా సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేయాలని సూచిస్తున్నారు. ఓటర్స్ హెల్ప్‌లైన్, ఎన్‌వీఎస్‌పీ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా కూడా ఓటు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశముంది. నిర్ణీత గడువులోపు అందిన దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తారు. నిబంధనల ప్రకారం ఉంటే వారిని ఓటర్లుగా గుర్తిస్తారు. ఈ నెల 25వ తేదీన ప్రకటించే ఓటరు అనుబంధ జాబితాలో వారి పేర్లు చేర్చుతారు. ఈ జాబితాలో పేర్లు కలిగిన కొత్త ఓటర్లతో పాటు సాధారణ ఓటర్లు మే 13వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వినియోగించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. గడువు సమీపిస్తున్నందున అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: దేశాభివృద్ధి, ప్రజాసంక్షేమాన్ని పక్కన పెట్టి మతం పేరుతో స్వార్థ రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీ, ఎంఐఎంల నుంచి దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని గద్దెనెక్కిన మోదీ ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ఉద్యోగాలు భర్తీ చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ దేశసంపదను కొల్లగొడుతోందని విమర్శించారు. ధరలు అమాంతం పెంచి నిరుపేదలపై మోయలేని భారం మోపుతోందని, పేదలు రెండు పూటలా కడుపునిండా తినలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంజేశారు. మోసపూరిత వాగ్దానాలతో రైతులు, నిరుద్యోగులు, మహిళలు, కార్మికులు ఇలా వర్గాలవారిని బీజేపీ ప్రభుత్వం వంచన చేసిందని ఆరోపించారు. ప్రజాస్వామ్యవాదులంతా ఏకమై రాబోయే ఎన్నికల్లో మతోన్మాద పార్టీలకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ నాయకులు కుంటాల రాములు, పొచ్చిరాం, రాందాస్, బెజ్జంకి నర్సింగ్‌రావు తదితరులున్నారు.

క్లుప్తంగా

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు


మాట్లాడుతున్న సీఐ సాయినాథ్‌

బేల: మండలంలోని సాంగి(జి) నుంచి ఆదిలాబాద్‌ వైపు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు జైనథ్‌ సర్కిల్‌ సీఐ సాయినాథ్‌ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంగ్వి(జి) గ్రామానికి చెందిన పాచ్చిరాం బుధవారం సాయంత్రం 7 కిలోల గంజాయి తీసుకెళ్తుండగా ముందస్తు సమాచారం మేరకు ఎస్సై రాధికతో పాటు సిబ్బంది పట్టుకున్నారన్నారు. ఆసిఫాబాద్‌ జిల్లాలోని వాంకిడి నుంచి విత్తనాలు తెచ్చుకుని తన వ్యవసాయ చేనులో గంజాయి సాగు చేస్తున్నాడని విచారణలో గుర్తించామన్నారు. గంజాయి విలువ రూ.1,75,000 వరకు ఉంటుందన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

గంజాయి పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్‌: మావల పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని కేఆర్‌కే కాలనీకి వెళ్లే మార్గంలో గురువారం ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి 130 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్‌ తెలిపారు. అంబాదాస్‌ (కేఆర్‌కేకాలనీ), సోనేరావు (రుమస్‌కాస, గాదిగూడ)ల వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గోధుమపిండి వాహనం అడ్డగింత

నిర్మల్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మ కాంప్లెక్స్‌ ఏరియాలో గురువారం మహారాష్ట్రకు చెందిన ఆశీర్వాద్‌ గోధుమపిండి వాహనాన్ని వ్యాపారులు అడ్డుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి అనుమతి లేకుండా గోధుమపిండి వస్తుందన్న సమాచారం మేరకు వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో దాదాపు 200 బ్యాగులు లభ్యమయ్యాయి. పోలీసులకు సమాచారం అందించడంతో వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు.

విద్యుత్‌ షాక్‌తో ఎద్దు మృతి


మృతిచెందిన ఎద్దు

భైంసారూరల్‌(ముధోల్‌): మండలంలోని కామోల్‌ గ్రామంలో గురువారం విద్యుత్‌ షాక్‌తో ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన చిన్నారెడ్డి ఎద్దు గ్రామ శివారులోకి మేతకు వెళ్లింది. పంటచేనులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ తీగలకు తగలడంతో విద్యుత్‌ సరఫరా జరిగి మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.60 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.


మిర్చి పంటలో పశువులను మేపుతున్న రైతు

ఎర్ర బంగారం.. ఏడిపిస్తోంది!

- తెగుళ్ల కారణంగా తగ్గిన దిగుబడి
- డిమాండ్‌ లేదని పతన మవుతున్న ధర
- వాతావరణ మార్పులతో మరింత ప్రభావం
- దిక్కుతోచని స్థితిలో మిర్చి రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

కుంటాల: మంచి దిగుబడి వస్తుందని మిర్చి సాగు చేసిన రైతులకు ఈ ఏడాదీ నిరాశే మిగిలింది. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పంట సాగుచేస్తే తెగుళ్లు, వర్షాల కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గింది. దీంతో చాలా మంది రైతులు పంటను చేలల్లోనే దున్నేయగా, మరికొందరు పశువులను మేపుతున్నారు.

పడిపోయిన ధరలు..

ఇదిలా ఉంటే.. అంతర్జాతీయ మార్కెట్లో మిర్చి పంటకు డిమాండ్‌ లేకపోవడంతో అమాంతంగా ధరలు పడిపోయాయి. నిర్మల్‌ జిల్లాలో ఈయేడు 560 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. రెండు మూడు రోజులుగా వాతావరణంలో మార్పులతో మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పంట దిగుబడి అంతంత మాత్రంగా ఉందని, ఈ సమయంలో వర్షాలు కురిస్తే కాయలు నల్లబడి ధర మరింత పడిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సీజన్‌ ప్రారంభంలో క్వింటాల్‌కు రూ.21 వేల నుంచి రూ.22 వేలు ధర పలికిన ఎర్ర బంగారం.. ఇప్పుడు రూ.8 వేల నుంచి రూ.13 వేల వరకు మాత్రమే ఉంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

తెగుళ్లతో తగ్గిన దిగుబడి..

ఎన్నో ఆశలతో ఎర్ర బంగారాన్ని సాగు చేసిన రైతులకు ఆది నుంచి కష్టాలు తప్పడం లేదు. పూత, కాత దశలోనే పంటకు ఎండుతెగులు సోకింది. ఎకరాకు 50 నుంచి 60 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా 20 క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇక జిల్లాలో మార్కెట్‌ సౌకర్యం లేకపోవడంతో వచ్చిన దిగుబడిని కూడా దళారులకే అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మంచి దిగుబడి వస్తే నాగపూర్‌ మార్కెట్‌కు తరలించాలనుకున్న రైతులకు తగ్గిన దిగుబడి నిరాశే మిగిల్చింది. ఇక మూడు రోజులుగా వాతావరణంలో మార్పులతో చేతికి వచ్చిన పంటను ఆరబెట్టేందుకు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురిస్తే మరింత నష్టపోతామని పేర్కొంటున్నారు. దిగుబడి, ధర తగ్గడంతో తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని మిర్చి రైతులు కోరుతున్నారు.

క్వింటాల్‌కు రూ.8 వేలే..



నాలుగు ఎకరాల్లో మిర్చి పంట సాగుచేశా. పూత, కాత దశలో ఎండు తెగులు సోకింది. పంట దిగుబడి బాగా తగ్గింది. వచ్చిన దిగుబడిని వరంగల్‌ మార్కెట్‌కు తీసుకెళ్లి క్వింటాల్‌కు రూ.8 వేలకే విక్రయించిన. ఇప్పుడు పంట మొత్తాన్ని దున్నేశా.

– చోటేమియా, రైతు, ఓలా

దిగుబడి తగ్గింది..



మిర్చి సాగుకు ఎకరానికి రూ.1.50 లక్షల పెట్టుబడి పెట్టిన. వాతావరణ పరిస్థితుల కారణంగా ధరలు పడిపోయాయి. కాయలు ఏరినా కూలీలకు కూడా సరిపోయే పరిస్థితి లేదు. చేసేదేమీ లేక పంటలో పశువులను మేపుతున్న. ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఎల్లమ్మల శంకర్‌, రైతు, కుంటాల

అకాల వర్షం.. పంటలకు నష్టం


దెబ్బతిన్న జొన్నపంట చూపుతున్న రైతు ఆనంద్‌

తాంసి: తాంసి, భీంపూర్‌ మండలాల్లో రెండు రోజులుగా ఈదురుగాలులతో కురుస్తున్న వర్షాలకు యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన అండే అశోక్‌ అనే రైతుకు చెందిన మూడెకరాల జొన్నపంట బుధవారం రాత్రి కురిసిన వర్షానికి నేలకొరిగింది. ఎకరాకు దాదాపుగా 18 క్వింటాళ్ల దిగుబడి వచ్చేదని.. వర్షం కారణంగా పంట నేలకొరగడంతో నల్లబారుతోందని .. దిగుబడి తగ్గుతుందని ఆందోళన చెందుతున్నాడు. మరో రెండు రోజులు వర్షం ఇలాగే కురిస్తే నష్టం తీవ్రత పెరుగుతుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అంధకారంలో భీంపూర్‌ వాసులు


జందాపూర్‌ వద్ద విరిగిపడిన విద్యుత్‌ స్తంభం

తాంసి: భీంపూర్‌ మండలంలోని పలు గ్రామాల ప్రజలు బుధవారం రాత్రి అంధకారంలో ఉన్నారు. ఈదురుగాలులతో కురిసిన వర్షానికి ఆదిలాబాద్‌ రూరల్‌ మండలం జందాపూర్‌ సమీపంలోని పంటచేనులో 33 కేవీ విద్యుత్‌ స్తంభం విరిగి నేలకొరగడంతో నిపాని, అర్లి(టి) సబ్‌ స్టేషన్‌లకు విద్యుత్‌ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో మండలంలోని భీంపూర్‌, వడూర్‌, ధనోర, నిపాని, అర్లి, గోన, కరంజి(టి), గుబిడి, వడ్‌గాం, తాంసి(కె), గొల్లఘాట్‌ గ్రామాలకు విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది. గురువారం ఉదయం ఏఈ శ్రావణ్‌ కుమార్‌ సిబ్బందితో కలిసి మరమ్మతులు చేపట్టి విద్యుత్‌ సరఫరా పునరుద్ధరించారు.

మహిళపై దురుసుగా ప్రవర్తించిన సెక్యూరిటీగార్డు

ఆదిలాబాద్‌టౌన్‌: రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బంధువును పరామర్శించేందుకు వచ్చిన నేరడిగొండ మండలానికి చెందిన ఓ మహిళపై రిమ్స్‌ సెక్యూరిటీగార్డు దురుసుగా ప్రవర్తించినట్లు బాధితురాలు పేర్కొంది. తాను లోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా చేయిపట్టి నెట్టివేశాడని తెలిపింది. ఇదే విషయమై తన బంధువు ఎందుకిలా ప్రవర్తించావని ప్రశ్నించగా అతనిపై నలుగురు సెక్యూరిటీగార్డులు దాడి చేసినట్లుగా బాధిత మహిళ పేర్కొంది. దీంతో కొద్దిసేపు రిమ్స్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడి నుంచి రిమ్స్‌ సెక్యూరిటీగార్డులతో పాటు బాధిత మహిళ, కుటుంబసభ్యులు పట్టణంలోని టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ కూడా వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కాగా సెక్యూరిటీగార్డును మహిళ బంధువు చొక్కా కాలర్‌ పట్టుకున్నారని, తాము ఎవరినీ నెట్టివేయలేదని, ఎలాంటి దాడి చేయలేదని వారు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్‌, డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్‌ అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పి పంపించేశారు.

కత్తితో దాడి..ముగ్గురికి గాయాలు


గాయాల పాలైన సయ్యద్‌ ముజాయిద్‌

ఆదిలాబాద్‌టౌన్‌: జిల్లా కేంద్రంలో పండుగ పూట కత్తులతో యువకులు ఘర్షణకు దిగడం కలకలం రేపింది. చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కొందరు యువకుల మధ్య వ్యాపార డబ్బుల విషయంలో వాగ్వాదం జరిగి గొడవకు దారి తీసినట్లు వన్‌టౌన్‌ సీఐ సత్యనారాయణ తెలిపారు. గురువారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో పట్టణంలోని కోలిపూర పాఠశాల సమీపంలో ఐదుగురు యువకుల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. కోలిపూరకు చెందిన అన్నదమ్ములు సయ్యద్‌ ముజాయిద్‌, సయ్యద్‌ షాహిద్‌ అక్కడి నుంచి టీ తాగేందుకు ఓల్డ్‌ బస్టాండ్‌కు వచ్చారు. గొడవను మదిలో పెట్టుకున్న మరో యువకుడు ఫజ్జు వెంట కత్తి తెచ్చుకున్నాడు. ఆ అన్నదమ్ముల వద్దకు చేరుకుని మరోసారి వారితో గొడవకు దిగాడు. వెంట తెచ్చుకున్న కత్తితో వారిపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో ముజాయిద్‌కు కడుపు భాగం, చెయ్యికి గాయాలయ్యాయి. అడ్డువచ్చిన తమ్ముడికి సైతం స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను రిమ్స్‌ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ముజాయిద్‌కు వైద్యులు చిన్నపాటి శస్త్ర చికిత్స చేశారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్‌ సీఐ సత్యనారాయణ రిమ్స్‌కు వెళ్లి వివరాలు సేకరించారు. అయితే యువకుల మధ్య జరిగిన గొడవకు పూర్తి కారణాలు తెలియరాలేదు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

ఇచ్చోడ: సర్కారు దవాఖానాకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని డీఎంహెచ్‌వో నరేందర్‌ రాథోడ్‌ అన్నారు. గురువారం ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. రోగులకు అందించే వైద్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రివేళలో వచ్చే రోగుల పట్ల వెంటనే స్పందించాలన్నారు. ఆరోగ్య కేంద్రాల ద్వారా 24 గంటల పాటు వైద్యం అందించాలన్నారు.

నగదు పట్టివేత


పట్టుకున్న నగదుతో పోలీసులు

తలమడుగు(బోథ్‌): మండలంలోని లక్ష్మీపూర్‌ చెక్‌పోస్టు వద్ద గురువారం నిర్వహించిన తనిఖీల్లో రూ.90 వేల నగదు పట్టుకున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు. కిన్వట్‌ నుంచి ఆదిలాబాద్‌కు వస్తున్న మారుతి షిఫ్ట్‌ కారును తనిఖీ చేయగా అందులో ప్రయాణిస్తున్న గంగాధర్‌ సీతారాం వద్ద రూ.90 వేల నగదు లభ్యమయ్యాయి. వాటికి సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్సై సురేందర్‌, రెవెన్యూ సిబ్బంది రవీందర్‌, తదితరులు పాల్గొన్నారు.

బేల: మండలంలోని శంకర్‌గూడ గ్రామ శివారులోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో గురువారం నిర్వహించిన తనిఖీలో రూ.లక్ష నగదు పట్టుకున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు. వైభవ్‌ అనే వ్యాపారి మహారాష్ట్రలోని కోర్పణ నుంచి పటాన్‌బోరికి కారులో రూ.లక్ష తరలిస్తుండగా పట్టుకున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్‌ చేసి ఎఫ్‌ఎస్‌టీ టీంకు అప్పగించినట్లు వారు పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య


నవ్య (ఫైల్‌)

జన్నారం: కడుపునొప్పి భరించలేక పురుగుల మందు మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మృత్యుంజయ సర్కార్‌, మృతురాలి తల్లి గంగమ్మ తెలిపిన వివరాల ప్రకారం బోథ్‌ మండలం కరత్వాడ గ్రామానికి చెందిన ఈదుల్ల గంగమ్మ, అడెల్లు దంపతుల కుమార్తె నవ్య (28)కు జన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన గద్దల శ్రీనివాస్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు ఇద్దరు సంతానం. ఉట్నూర్‌ ఆర్డీవో కార్యాలయంలో ఎస్‌వోగా పనిచేస్తున్న నవ్య కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయంకాలేదు. ఈ నెల 10న కడుపునొప్పి తీవ్రం కావడంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు ముందుగా జన్నారం, అక్కడి నుంచి మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. గంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నర్సాపూర్‌(జి): రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు నర్సాపూర్‌ (జి) మండల కేంద్రానికి చెందిన తమ్మరాశి భూమన్న బుధవారం ద్విచక్ర వాహనంపై లోకేశ్వరం మండలం హవర్గా గ్రామానికి వెళ్లి వస్తుండగా అర్లి(కే)సమీపంలో కంకెట గ్రామానికి చెందిన సుధీర్‌ కుమార్‌ ద్విచక్ర వాహనంతో ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. భూమన్న సోదరుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నట్లు ఎస్సై హన్మండ్లు తెలిపారు.

కొబ్బరి నీళ్లకు డిమాండ్‌

- ఆరోగ్యానికి సైతం అన్నివిధాలా మేలు
- కొనుగోలుకు ప్రజల ఆసక్తి


జిల్లా కేంద్రంలోని ఓ కొబ్బరిబోండాల దుకాణం

నిర్మల్‌ఖిల్లా: వేసవికాలంలో మండుతున్న ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కొబ్బరి బోండాలు తాగేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో జిల్లాలో కొబ్బరిబోండాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మన రాష్ట్రంలో కొబ్బరి తోటల సాగు తక్కువగా ఉండడంతో ఆంధ్రప్రదేశ్‌, తమిళనాడు, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయి. ప్రతిరోజు ఉదయం తెల్లవారుజామునే లారీల్లో జిల్లా కేంద్రానికి కొబ్బరి బొండాల లోడు చేరుకుంటుండగా, అక్కడి నుండి విక్రయదారులు టోకున కొనుగోలు చేసి రోజంతా రిటైల్‌ అమ్మకాలు సాగిస్తున్నారు. ఒక్కో లారీలో దాదాపు 7వేల వరకు కొబ్బరి బొండాలను తరలిస్తున్నారని, వాటిని కొనుగోలు చేసి తమ దుకాణాల్లో అమ్ముతున్నట్లు విక్రయదారు వెంకటేశ్వర్లు 'సాక్షి'తో తెలిపారు.

ఒక్కో బోండాం రూ.40

జిల్లా కేంద్రంలో కొబ్బరి బొండాల ధరలు కూడా గతంలో కంటే ప్రస్తుతం పెరిగాయి. గతంలో ఒక్కో కొబ్బరిబోండాం రూ.25 నుంచి రూ.30 చొప్పున అమ్మేవారు. ప్రస్తుతం రూ.40 నుంచి రూ.50 వరకు ధర పలుకుతోంది. అదే కొబ్బరి నీరు ఒక లీటర్‌ బాటిల్‌ కొనాలంటే రూ.150 అవుతుంది. ఇతర శీతల పానీయాల కంటే స్వచ్ఛమైన కొబ్బరినీరు తాగడం ఆరోగ్యానికి మంచిదని భావించి ప్రజలు కొబ్బరి బొండాలు సేవించడానికి ఇష్టపడుతున్నారు. అనారోగ్యం పాలైన వ్యక్తులు, హాస్పిటల్లో ఇన్‌ పేషెంట్లుగా జాయిన్‌ అయినవారు కూడా కొబ్బరి బోండాలను సేవింప చేస్తున్నారు. దీంతో కొబ్బరి బొండాలకు డిమాండ్‌ గణనీయంగా పెరుగుతోంది.

ఆరోగ్యానికి మేలు



కొబ్బరి బోండాం సేవించడం వల్ల ఆరోగ్యానికి అనేక విధాలుగా ప్రయోజనం చేకూరుతుంది. శరీరానికి అవసరమైన పొటాషియం, సోడియం, మెగ్నీషియం పుష్కలంగా అందుతాయి. ఖనిజ లవణాలు లభించడంతో పాటు శరీరానికి నీరసం, అలసటను దూరం చేస్తుంది. తక్షణ శక్తిని అందజేస్తుంది. డీహైడ్రేషన్‌ పరిస్థితిని నియంత్రిస్తుంది. మూత్రపిండాల వ్యవస్థను కూడా మెరుగుపరుస్తుంది. ఎండలో తిరిగి వాంతులు, విరోచనాలు అయినప్పుడు కొబ్బరిబోండాలతో ఉపశమనం పొందవచ్చు.

– డాక్టర్‌ ఎస్‌.శశికాంత్‌, ల్యాప్రోస్కోపిక్‌ సర్జన్‌, నిర్మల్‌

అలసట దూరమై శరీరానికి శక్తినిస్తుంది



నేను వృతిరీత్యా ప్రతీరోజు ఎండలో తిరగాల్సి ఉంటుంది. ఎండనుంచి ఉపశమనం పొందేందుకు వారంలో రెండు మూడు సార్లు కొబ్బరిబోండాలను తాగుతా. దీనివల్ల ఆరోగ్యం కూడా బాగుంటుందని డాక్టర్లు చెప్పారు. అలసట దూరమై శరీరానికి శక్తినిస్తుంది. కొబ్బరినీరు తాగడం అలవాటుగా మారింది.

– రాజు, వినియోగదారుడు, నిర్మల్‌

వేసవిలో పశుపోషణపై శ్రద్ధ వహించాలి

- కత్తెరశాల పశువైద్యాధికారి శ్రీనివాస్‌


శ్రీనివాస్‌, వెటర్నరీ వైద్యుడు, కత్తెరసాల



చెన్నూర్‌రూరల్‌: వేసవిలో మూగజీవాల పోషణపై సరైన శ్రద్ధ వహించాలని కత్తెరసాల పశు వైద్యాధికారి శ్రీనివాస్‌ సూచించారు. వేసవిలో పశుపోషణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పాడి పశువులకు వేసవిలో మేత, దాణాను సరిపడా అందించాలి. పచ్చిమేత దొరకని సమయంలో ఎండుమేతతో పాటు దాణా ఎక్కువగా ఇవ్వాలి. పశువులకు ఎల్లవేళలా పరిశుభ్రమైన చల్లని నీరు లభించేలా చూడాలి. మేత, నీరు సరిపడా ఉంటే పాడి పశువులు వేసవిలో కూడా పాలు బాగా ఇస్తాయి. ఎదకొచ్చి చూలు కడుతాయి. వేసవిలో పాల ధరలు పెరుగుతున్నాయి. ఇవి ఇంకా పెరిగే అవకాశాలు ఉంటాయి. ఈ సమయంలోనే పాల ఉత్పత్తి ఎక్కువగా ఉంటే పాడి పరిశ్రమకు లాభదాయకం. ఇందుకు పశువుల షెడ్లు(కొట్టాల) వద్ద చల్లని వాతావరణం ఉండేలా చూడాలి. వీలైతే షెడ్డు (కొట్టాల)పై గడ్డిని కప్పి ఉంచాలి. అలాగే షెడ్డు(కొట్టాల) చుట్టూ తడికెలు, గోనె సంచులు కట్టి వాటిపై నీళ్లు చల్లాలి. పశువులపైన కూడా మధ్యాహ్నం రెండు, మూడు సార్లు నీళ్లచల్లితే మంచిది. గేదెలను మధ్యాహ్నం పూట చెరువులకు పంపి కొంతసేపు అందులో ఉండనివ్వాలి. కొట్టాల చుట్టూ పెద్ద చెట్లు ఉంటే లోపల చల్లగా ఉంటుంది. ఈ పద్ధతులు పాటిస్తే పాలు ఎక్కువగా ఉండటమే కాకుండా పశువులు ఎదకొచ్చి చూడి కడుతాయి. అలా అవి ఏడాది పొడవునా పాలిచ్చే అవకాశం ఉంటుంది. సా యంత్రం పూట పాలు పితికే ముందు పశువును, పొదుగును చల్లని నీటితో కడిగితే మంచిది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వేసవిలో గొర్రెలు, మేకలను జత కలిపి చూడి కట్టించాలి. మూడు నెలల వయసు దాటిన పిల్లలను తల్లుల నుంచి వేరు చేయాలి. పిడుదులు, గోమార్లు లేకుండా మూడు వారాలకోసారి మందు కలిపిన నీటిలో గొర్రెలను తడిపి తీయాలి. అమ్మతల్లి (బొబ్బ, మశూచి) టీకాలను, చిటుక రోగం టీకాలను పిల్లలకు తప్పకుండా వేయించాలి. వేసవిలో ఎండలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి గొర్రెలు, మేకలకు, ముఖ్యంగా పిల్లలకు వడగాలులు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మధ్యాహ్నం సమయంలో బయట మేపక పోవడం మంచిది. బయట మేసే సమయంలో చెట్ల నీడ, తాగునీటి సదుపాయం ఉండేలా చూసుకోవాలి. పశు వైద్యుని సలహా మేరకు నట్టల నివారణ మందులను వినియోగించాలి. ఈ జాగ్రత్తలు పాటిస్తే వేసవిలో పశువులు, జీవాలను కాపాడుకోవచ్చు.